ప్రజాశక్తి

ఆదివారం 8 జనవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఆవాజ్ రాష్ట్ర మహాసభకు సర్వం సిద్ధం



మహాసభ వేదిక సమీపంలో ఏర్పాట్లలో నిమగ్నమైన కార్యకర్తలు, నాయకులు

- గుంటూరులో నేడు, రేపు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- రాష్ట్ర వ్యాప్తంగా హాజరుకానున్న 300 మందికిపైగా ప్రతినిధులు
- భారత రాజ్యాంగం -లౌకికవాదం పరిరక్షణపై నేడు రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

అవాజ్ రాష్ట్ర 2వ మహాసభ నేడు, రేపు గుంటూరులో నిర్వహించనున్నారు. మహాసభకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరు కానున్నారు. మహాసభల విజయవంతానికి ఆహ్వాన సంఘం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. స్థానిక పాతగుంటూరు, పొన్నూరు రోడ్డులోని లాల్‌జాన్‌భాషా షాదీఖానాలో రెండ్రోజుల పాటు జరిగే ఈ మహాసభలో భాగంగా మొదటి రోజు ఉదయం 10.30 గంటలకు 'భారత రాజ్యాంగం–లౌకికవాద పరిరక్షణ' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు వక్తలుగా ఎపి హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, అవాజ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, ఆహ్వాన సంఘం ఛైర్మన్, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ షేక్.సాబ్జి తదితరులు హాజరై ప్రసంగిస్తారు. అనంతరం ప్రతినిధుల సభ నిర్వహిస్తారు. సాయంత్రం పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఇస్లామియా హైస్కూల్లో దేశక్తి, లౌకికవాదం, ప్రజాస్వామ్యంపై ముషాయిరా(సాంస్కృతిక కార్యక్రమాలు) నిర్వహించారు. మహాసభల్లో ప్రధానంగా రాష్ట్రంలోని ముస్లింలు ఎదుర్కొంటున్న విద్యలో, ఆర్థిక వెనుకబాటుపై, ముస్లిముల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకోనున్నారు. ముస్లింల సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించనున్నారు.

కేంద్రం కుట్రపూరితంగా తీసుకొచ్చిన సిఎఎ, ఎన్ఆర్‌సికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో భాగంగా అవాజ్ గుంటూరులో లౌకిక వాదులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు జరిపింది. పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఘటనలో అమాయక ముస్లిములపై కేసులు మోపటాన్ని నిరశిస్తూ సుదీర్ఘకాలం రాజీలేని పోరాటం నడిపింది. దేశంలో వివిధ ప్రాంతాల్లో మైనార్టీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ లౌకిక వాద పరిరక్షణకు కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అత్యధికంగా ముస్లిమ్ జనాభా కలిగిన నగరాల్లో గుంటూరు కూడా ఒకటైన గుంటూరులో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి.

ఇప్పటికీ ముస్లిములు చిన్న ▶ 2లో



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

అనుమతి లేకుండా హద్దులు!

- రైతులకు అన్యాయం చేసే ధోరణిలో అధికారుల తీరు
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేమి
- రైతులకు అన్యాయం చేస్తే ఉద్యమం
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- కలెక్టరేట్ ఎదుట నిరసన, వినతి - న్యాయానికి కలెక్టర్ హామీ

ప్రజాశక్తి - నరసరావుపేట

167ఎ పేరుతో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు బైపాస్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిన ప్రతిపాదనను ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందేనని ఇదే సమయంలో రైతుల అభిప్రాయం అభీష్టం మేరకు మాత్రమే రైతుల భూముల్లో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. ఈ మేరకు రైతులతో కలిసి కలెక్టరేట్ వద్ద శనివారం నిరసన చేపట్టారు. రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ చీరాల వాడరేవు (ఎన్.హెచ్ 167 ఏ) హైవే బాధితులు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట శివారు ప్రాంతాలైన కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సప్పాలెం, గుంటగార్లపాడు, రావిపాడు గ్రామాలకు చెందిన 150 మంది రైతులు తమ భూముల్లో బైపాస్ నిర్మాణం వద్దని అభ్యంతరాలు చెబుతున్నా ▶ 2లో



నిరసన తెలియజేస్తున్న 108 ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

కలెక్టరేట్ ఎదుట 108 ఉద్యోగులు ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 108 ఉద్యోగులు శనివారం స్థానిక నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ నుండి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా 108 అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.నేతాజి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 108లో పనిచేస్తున్న సిబ్బంది గతనెల 14న సమ్మెకు పిలుపునిచ్చి, నోటీసులు అందచేస్తే ప్రభుత్వం, యాజమాన్యం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని చెప్పారు. సమస్యల పరిష్కారం కాకపోతే జనవరి 15వ తేదీ తర్వాత ఏక్షణంలోనైనా రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా 108 ఉద్యోగుల ▶ 2లో



పెదకాకాని మండలం నంబూరులో గిరిజనులతో మాట్లాడుతున్న పాశం రామారావు తదితరులు

ప్రజాసమస్యలపై సిపిఎం బృందం సర్వే

బృంద సభ్యులకు జగనన్న కాలనీ సహా పలు కాలనీల్లో సమస్యలు తెలిపిన ప్రజలు

5 లో

ఇద్దరికి మాధవపెద్ది సత్యం పురస్కారాలు

అందుకున్న గాయని శైలజ, సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ వార్త మెయిన్‌లో



అర్జీలు అందజేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 20 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు

వివిధ శాఖల ఉద్యోగుల నుండి అందిన ఫిర్యాదులను సంబంధిత కార్యాలయాలకు పంపుతామని, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ 'స్పందన' కార్యక్రమంలో నిర్వహించారు. ఉద్యోగుల నుండి ఫిర్యాదులను కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖరరావుతో కలసి ఉద్యోగుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 20 మంది ప్రభుత్వ ఉద్యోగుల నుండి ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ మాట్లాడుతూ ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఓ

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఫిబ్రవరి చివరి నాటికి వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డిపిఓ ఆర్.కేశవరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం దుగ్గిరాల, కొల్లిపర, తెనాలి మండలాలకు చెందిన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు సగటున 50 శాతం ఇంటి పన్నుల వసూలు పూర్తి అయినట్లు చెప్పారు. తెనాలి డివిజన్ ఆర్థికంగా పటిష్టమైన ప్రాంతమని, ఇక్కడ వంద శాతం పన్నులు వసూలు చేసే అవకాశం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా రూ.24 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టారన్నారు. దీనికోసం అన్ని మండలాల్లో రివ్యూ నిర్వహిస్తున్నామన్నారు. భూ సర్వే నిర్వహిస్తున్నామని గ్రామ కంఠం ఏరియాలో కూడా పట్టాలు ఇస్తారని, అమ్ముకోవచ్చు, కొనుక్కోవచ్చని చెప్పారు. సమావేశంలో డిఎల్పిఓ ఆర్ శ్రీనివాస్‌నాయక్, కొల్లిపర యుపిఆర్డి కె.ప్రభాకర్, తెనాలి శ్రీనివాసరావు, మూడు మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు వివరిస్తున్న పిఆర్పి రామకృష్ణ

కిచెన్ గార్డెన్స్ వేసుకోండి

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని సిరిపురంలో మహిళా సంఘం సభ్యులకు ప్రకృతి వ్యవసాయం చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాల పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామంలోని వివిధ డ్వాక్రా గ్రూపుల మహిళ సంఘాల సభ్యులు తమ ఇంటి ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్స్ వేసుకోవాలని సూచించారు. రైతులను కలిసి రబీలో అందరూ 18 రకాల విత్తనాలు,బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకొని చల్లుకుంటే 45 రోజుల తర్వాత కలియ దున్నేస్తే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. అలాగే, భూమిలో పోషకాలు ఉంటాయని, అభివృద్ధి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తినడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని కలిగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పిఆర్పి రామకృష్ణ, ఎల్2 తిరుపతిరావు, వాణి ,మేరీ మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



కొత్త పింఛన్ల పంపిణి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

సామాజిక పింఛన్ ద్వారా అవ్వాతాతలకు అండగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం జరిగిన కొత్త పింఛన్ల పంపిణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పింఛన్లు పెంచడమే కాకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ కొత్త పింఛన్ మంజూరు చేస్తోందని చెప్పారు. అన్నారు. కమిషనర్ ఎన్. రాధ, సచివాలయం సిబ్బంది పాల్గొనారు.

ఉత్సవ విగ్రహాలుగా గ్రామ సచివాలయాలు

కుంచనపల్లిలో సిపిఎం వినతి

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

పేరుకే గ్రామ సచివాలయం.. ఏ సమాచారం అడిగినా ఇక్కడి అధికారులు బదులివ్వరు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో గ్రామ సచివాలయ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవ హరిస్తున్నారు. శనివారం సిపిఎం నాయకులు గ్రామ సచివాలయ పరిధిలో ఇస్తున్న పింఛన్ల జాబితా ఇవ్వమంటూ సచివాలయ కార్యదర్శి గోపాలరెడ్డికి అర్జీ ఇచ్చి కోరారు. 'మా చేతిలో ఏమీ లేదు. మున్సిపల్ కమిషనర్ చెప్పాలి' అని ఆయన సమాధానమిచ్చారు. స్థానికంగా ఉన్న గ్రామ సచివాలయాలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయని సిపిఎం గ్రామ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండే వీటిలో కనీసం సమాచారమివ్వడానికి కూడా. అధికారులు చొరవ చూపకపోవడం, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సేవలు వినియోగించాలని అధికారులను కోరారు.



కుంచనపల్లిలో సచివాలయ కార్యదర్శికి అర్జీ ఇస్తున్న నాయకులు

అనుమతి లేకుండా హద్దులు!

వారికి సర్వేయర్లు, అధికారులు హద్దు రాళ్లు వేయిస్తున్నారని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అడ్డుకోవడంతో నిలిపివేసి వెనక్కి వెళ్లారన్నారు. బాధిత రైతులు ఇప్పటికే ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారని, బైపాస్ నిర్మాణానికి తమ భూములు ఇవ్వబోమని, ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలని చెప్పినా పట్టించుకోకుండా వారి భూముల్లో హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం దారుణమని అన్నారు. పురపాలక సంఘం ఏర్పాటు చేసిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం బైపాస్ రోడ్డు మొత్తం కూడా మున్సిపల్ పరిధిలో వెళ్తుందని, నేషనల్ హైవే అథారిటీస్ ప్రకారం వంద కిలోమీటర్ల వేగానికి తగ్గకుండా వాహనాలు వెళ్లాల్సి ఉంటుందని, పట్టణ పరిధిలో ఈ ప్రతిపాదన సాధ్యం కాదని ధ్రువీకరించారని తెలిపారు. రైతుల అభిప్రాయం తీసుకోకుండా, రైతులకు తెలియకుండా రైతులకు అన్యాయం చేసే ధోరణితో అధికారులు భూముల్లోకి ప్రవేశిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

రైతులకు కలెక్టర్ హామీ

సమస్యలు విన్న కలెక్టర్.. రైతులతో మాట్లాడుతూ రైతుల అభిప్రాయం, అభీష్టం మేరకే భూముల సేకరణ ఉంటుందని, బలవంతపు భూసేకరణ చేపట్టబోమని హామీ ఇచ్చారు. ఈ విషయమై రైతుల పక్షాన ప్రజా ప్రతినిధులతో, నేషనల్ హైవే అథారిటీస్ సిబ్బందితో మాట్లాడతానని అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ నరసరావుపేట పట్టణానికి ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిస్తామని, రైతులు తమ భూములకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు వస్తే ఎప్పుడైనా తనకు చెప్పొచ్చని అన్నారు. బైపాస్ మార్పు నిర్ణయం తీసుకొని మీకు చెప్పలేకపోయామనిఅన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, పిడిఎం నాయకులు ఎన్.రామారావు, ఎన్.సత్యనారాయణ, యు.అప్పయ్య, కేసానుపల్లి, జొన్నలగడ్డ, గుంట గార్లపాడు, ఇస్సప్పాలెం, రావిపాడు తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -తెనాలి

రూరల్ గ్రామం బుర్రిపాలెం జగనన్న లేఅవుట్ ను స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్తో కలిసి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి శనివారం పరిశీలించారు. అనంతరం అధికారులతో లేఅవుట్ ప్రాంతంలోనే సమీక్షించారు. మొత్తం లబ్ధిదారులు, గహ నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు, గహ నిర్మాణాల పురోగతిని అధికారుల ద్వారా తెలుసుకున్నారు .ఈ సందర్భంగా నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదానశీం, కమిషనర్ ఎం జస్వంత్ రావు, తహసిల్దార్ కే రవిబాబు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆవాజ్ రాష్ట్ర మహాసభకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

చిన్న ఇళ్లలో రెండు, మూడు కుటుంబాలు జీవిస్తున్నాయి. కనీస వేతనాలు కూడా దక్కని ట్రాన్స్‌పోర్ట్, ఆటోమొబైల్, ఫుట్ పాత్ వ్యాపారాలు వంటి అసంఘటిత రంగంలో ముస్లిం జనాభా అందరికంటే 91.శాతం పైగా ఉంది. సంఘటిత రంగంలో కేవలం 7.9 శాతం జనాభా మాత్రమే ఉంది. ముస్లిముల సంక్షేమానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు శూన్యమని ఆవాజ్ నాయకులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ముస్లిమ్ మైనార్టీల ఆర్థికాభివృద్ధికి మైనార్టీ ఆర్థిక సహకర సంస్థ ద్వారా ఇచ్చే రుణాలు నిలిపివేశారు. వక్ఫ్‌భూముల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా సచార్ కమిటీ నివేదిక అమలులో పాలకులు తీవ్ర వైఫల్యం చెందారు. ఈ నేపథ్యంలో ముస్లిమ్ మైనార్టీల భద్రత, అభ్యున్నది, లౌకికవాదం నినాదాలతో ఆవాజ్ పనిచేస్తోంది. అవాజ్ మహాసభ విజయవంతానికి ప్రజలు సహకరించాలని ఆహ్వాన సంఘం అధ్యక్షులు కెవెస్ లక్ష్మణరావు, ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ చిష్టీ కోరారు.



మహాసభ నిర్వహణపై వివరాలు వెల్లడిస్తున్న అవాజ్ నాయకులు

12వ తేదీ నుండి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ.ముప్పాళ్లలో 31వ రైతుమిత్ర జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ఈ నెల 12వ తేదీ నుండి నిర్వహిస్తామని నిర్వాహకులు తల్లపనేని రామారావు తెలిపారు. ఐదు రోజులు పాటు డే అండ్ నైట్ కబడ్డీ పోటీలు ఉంటాయని, ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.లక్ష, తృతీయ బహుమతి రూ.70 వేలు, నాలుగో బహుమతి రూ.50 వేలు, 5వ బహుమతి రూ.40 వేలు, ఆరో బహుమతి రూ.30 వేలు, ఏడవ బహుమతి రూ.20 వేలు, ఎనిమిదవ బహుమతి రూ.15 వేలు, కన్సోలేషన్ బహుమతులు రూ.50 వేల వరకూ ప్రదానం చేస్తామని వివరించారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు వసతి ఏర్పాట్లు ఇప్పటికే చేశామన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 20 ఫిర్యాదులు

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదులకు సంబంధించి ప్రతి కార్యాలయంలో రిజిష్టర్‌ను నిర్వహించాలని కోరారు. పరిష్కరించిన ఫిర్యాదులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు కలక్టరేట్‌కు నివేదించాల్సి ఉంటుందన్నారు. అందిన ఫిర్యాదులు ఉన్నతాధికారుల పరిధిలో వుంటే ఆ మేరకు జిల్లా అధికారులు వారి ఉన్నతాధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి యాక్షన్ టేకెన్ రిపోర్ట్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, డిఇఒ శైలజ, డిఎస్‌ఒ పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి మనోరంజని, హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, డిపిఒ కేశవరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలపై దృష్టి సారించాలని, ఉద్యోగులను చర్చలకు పిలిచి, ప్రజల ప్రాణాలు కాపాడే 108 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు షేక్.హసన్ మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించటానికి ఇఎంటి పైలెట్‌ను వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇయంటిలకు రూ.30 వేలు, పైలెట్‌లకు రూ.28 వేలు జీతం ప్రతి నెలా 5వ తేదీలోగా చెల్లించాలని కోరారు. సిఎం హామీకి విరుద్ధంగా ఎఇఎంఎస్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన తర్వాత విధుల నుండి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇపిఎఫ్, ఇఎస్‌ఐకు సంబంధించి ప్రతినెలా చెల్లించే యాజమాన్య, ఉద్యోగుల వాటాలు రెండింటినీ ఉద్యోగుల జీతం నుండే మినహాయించటం అన్యాయమన్నారు. చట్ట ప్రకారం యజమాన్య వాటా యజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. వాహనాలు సరైన కండిషన్‌లో ఉంచాలని, ప్రతి వాహనంకు మెడికల్ ఇండెంట్‌ను ప్రతినెలా సమకూర్చాలని తదితర డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వై.శివనాగేశ్వరరావు, సిహెచ్.శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

నేడు మాచర్లకు బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి కండిషన్ బెయిల్‌పై మాచర్ల పట్టణ పోలీసుస్టేషన్‌లో సంతకం చేసేందుకు ఆదివారం మాచర్లకు వస్తున్నారు. దీనిపై పట్టణంలో ఆసక్తికరమైన చర్చ జరుగుతుంది. గత నెల 16వ తేదీన మాచర్ల పట్టణంలో టిడిపి ఆధర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహిస్తుండగా మున్సిపల్ కార్యాలయం సెంటర్‌లో వైసిపి వారు ఎదురుపడటంతో ఘర్షణ జరిగింది. ఘర్షణలో బ్రహ్మారెడ్డి మరి కొంత మందిపై టిడిపికి చెందిన ఆరిపై హత్యయత్నం కేసుతో పాటు పలు సెక్షన్లు కింద కేసులు నమోదయ్యాయి. వైసిపి నాయకులపైనా కేసులు పెట్టారు. మరోవైపు అప్పటి నుండి మాచర్లలో 144 సెక్షన్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బ్రహ్మారెడ్డి అతని అనుచరులు ముందుస్తు కండిషన్ బెయిల్ పొంది, దానిలో భాగంగా మాచర్ల పట్టణ పోలీసుస్టేషన్‌లో సంతకాలు పెట్టేందుకు రానుండడం ఉత్కంఠగా మారింది. పోలీసులు సైతం పూర్తి స్థాయిలో బందోబస్తు చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ నిధుల మళ్లింపు సరికాదు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఎస్సీ కార్పొరేషన్ నిధులు నవరత్నాలకు మళ్లించడం దుర్మార్గమని, దీనిపై హైకోర్టు ప్రశ్నిప్రభుత్వానికి చెంప పెట్టు అని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గోదా జాన్‌పాల్ అన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లు నామమాత్రంగా మారాయని, వాటిల్లోని ఉద్యోగులకూ జీతాలు చెల్లించటమూ ప్రజాధనం వృథా అని చెప్పారు. కార్పొరేషన్ ఉద్దేశ్యం నెరవేరనప్పుడు దాన్ని మూసివేయటం మంచిదని, బిల్లులు చెల్లింపు వివరాలతో అదనపు అఫిడవిట్ వేయాలని హైకోర్టు ఎస్సీ కార్పొరేషన్ ఎమ్‌డికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ నిధులతో పాటు సబ్ ప్లాన్ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు.



దుండగుల దాడిలో దెబ్బతిన్న బండి

న్యూడిల్స్ బండి ధ్వంసం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లో చిరువ్యాపారం నిర్వహించే న్యూడిల్స్ బండి అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి పగలగొట్టారు. 10 గంటల వరకు రోజు వారిలోగానే వ్యాపారం చేసుకుని ఇంటికి వెళ్లిన తనకు శనివారం ఉదయం వచ్చి చూసే సరికి న్యూడిల్స్ బండి అద్దాలు పగిలిపోయి ఉన్నాయని బాధితుడు వాపోయాడు. గంజాయి బ్యాచ్ ఈ పని చేసి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.4 వేలు నష్టం వాటిల్లినట్లు తాడేపల్లి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

వేలం నిర్వహిస్తున్న పోలీసులు



గడపగడపకు వందరోజుల వేడుక

ప్రజాశక్తి - మాచర్ల

గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా స్థానిక 8 వార్డులోని నరిశెట్టి కళ్యాణ మండపంలో ఫంక్షన్ 100 కిలోల కేక్‌ను కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం కట్ చేశారు. అనంతరం వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ టి.కిషోర్, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, వైస్ చైర్మన్ పి.నరసింహారావు, జి.నాగేశ్వరరావు, ఎం.సంతోష్, సుభాని, చిన ఏసోబు, అబ్దుల్ జలీల్, శ్రీనివాసరావు, సాయిమార్కోండారెడ్డి పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

రూ.148.95 కోట్లతో రహదారికి త్వరలో శంకుస్థాపన

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలో సచివాలయం-1 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మూడోరోజైన శనివారం నిర్వహించగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు అందించారు. అమరావతి సచివాలయ పరిధిలో మూడేళ్లలో సంక్షేమ పథకాల కింద రూ.15 కోట్లు ఇచ్చామని, రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. నియోజకవర్గానికి ప్రధాన రహదారి అయిన అమరావతి-బెల్లంకొండ డబుల్ లేన్ రోడ్డు నిర్మాణానికి రూ.148.95 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో సిఎం ద్వారా శంకుస్థాపన చేస్తామని చెప్పారు. తహశీల్దార్ కె.విజయశ్రీ, ఎంపిడిఒ పి.మాధురి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ పి.రాజేశ్వరి, ఉపసర్పంచ్ ఎన్.విజయసాగర్‌బాబు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

పత్తిలారీ బోల్తా

ప్రజాశక్తి - నాదెండ్ల

పత్తి బేళ్లతో వెళుతున్న లారీ అదుపుతప్పి తిరగబడిన సంఘటన మండలంలోని తూబాడు - నాదెండ్ల గ్రామాల మధ్య శనివారం చోటుచేసుకుంది. స్థానికులు వివరాలు ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల నుండి చిలకలూరిపేట వైపు వెళ్తున్న లారీ తూబాడు సమీపంలోకి రాగానే రోడ్డుపై మరమ్మతులు చేస్తున్న మిల్లర్ రోడ్డుపై అడ్డంగా ఉండటంతో దాన్ని తప్పించే ప్రయత్నంలో రోడ్డు మార్జిన్ దాటి పక్కకెళ్లింది. దీంతో లారీ అదుపుతప్పి కాల్వలోకి తిరగబడింది. అయితే ఎవరికీ ప్రమాదం జరగ్గపోవడంలో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి - అచ్చంపేట

అచ్చంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడ్డ 15 ద్విచక్రవాహనాలకు వేలం పాటలు నిర్వహించగా రూ.4,81, 565 ఆదాయం ప్రభుత్వానికి చేకూరింది. కొంతకాలంగా అక్రమ మద్యం తరలిస్తున్న వాహనాలపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. పెదకూరపాడు సిఐ వీరస్వామి ఆధ్వర్యంలో 15 ద్విచక్ర వాహనాలు విలువను ఆర్టీవో రూ. 1,80,600 గా నిర్ణయించారు. పాటదారులు ఆయా వాహనాలను రూ.4,81,565కు దక్కించుకున్నారు. 55 మంది రూ.2,000 ధరావతు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. ఒక్కొక్క వాహనానికి పాటదారుడు వేలం పాడిన సొమ్ము చెల్లించి,12 శాతం జీఎస్టీ, రిజిస్ట్రేషన్ సొంత ఖర్చులతో లబ్ధిదారులు చేయించుకోవాలని పోలీసులు తెలిపారు. ఎస్సై కె.రవీంద్ర వేలం నిర్వహించారు.



యడ్లపాడులో ఆయిల్ ఇంజన్ చోరీ

ప్రజాశక్తి - యడ్లపాడు

గతనెల 13 రాత్రి ఎడ్లపాడు కారుచోల గ్రామాల మధ్య కొండవీటి మేజర్ కాల్వ కట్టపై ఉన్న మోహన్ రావుకు చెందిన రూ.40,000 విలువైన ఆయిల్ ఇంజన్ చోరీ చేశారు. నీటిపైపులు, ఫుట్బాల్ కోసి బెడ్ నుంచి ఇంజన్ వేరు చేసి ఇంజన్ ఎత్తుకెళ్లారు. శుక్రవారం రాత్రి అదే మార్గంలో అదే తరహాలో ఆయిల్ ఇంజన్ చోరీకి గురైంది. యడ్లపాడు చెందిన డేగల పేతురు నారాయణ చెరువు వద్ద ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేసుకొని పక్కనే ఉన్న మిరప తోటకు గత రెండు రోజులుగా నీరు పెట్టుకుంటున్నాడు. రాత్రి పది గంటల వరకు అక్కడే ఉన్నాడు. ఉదయం చేను వద్దకు వెళ్లి చూసుకోగా ఇంజన్ కనిపించలేదు.

హెచ్‌ఎం కాలేషావలి మృతి



ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని చిరుమామిళ్ల శ్రీ కాసు రాగవమ్మ బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా షేక్ కాలేషావలి (56) శనివారం చిలకలూరిపేటలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భౌతికకాయాన్ని ఎంఇఒ ఐ.ఆంజనేయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో జీవో 1 ప్రతుల దహనం

ప్రజాశక్తి - వినుకొండ



రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ప్రజాస్వామ్యానికి పాతరేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో 1ని జారీ చేశారని అఖిల పక్ష నాయకులు మండిపడ్డారు. జీవో ప్రతులను స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో దహనం చేశారు. తొలుత సిపిఐ కార్యాలయంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించి జీవోను రద్దు చేసేదాకా పోరాడాలని నిర్ణయించారు. సమావేశానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి వీల్లేదంటూ బ్రిటీష్ కాలం నాటి 1861 పోలీస్ యాక్ట్ ఆధారంగా జీవోను తేవడం, దీన్ని అన్ని రాజకీయ పార్టీలు పాటించాలనడం దుర్మార్గమన్నారు. జీవించే హక్కుతోపాటు భావ ప్రకటన స్వేచ్ఛ, నిరసన తెలిసే హక్కు అందరికీ ఉంటాయని, వీటిని కాదనడానికి ప్రభుత్వానికి అధికారం లేదని అన్నారు. ఈ జీవోను రద్దు చేయకుంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి నాయకులు పి.నాగేశ్వరరావు, పీవీ సురేష్, సిపిఎం నాయకులు బి.వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు ఎన్.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఆర్‌కె నాయుడు, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు యు.రాము, సురేష్‌రాజా, లాల్‌ఖాన్, చిన్న, పవన్ కుమార్ పాల్గొన్నారు.



లబ్ధిదార్లకు పింఛన్లు అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఎన్నికలకు వెళ్లేముందు రూ.3 వేల పింఛను

మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - ముప్పాళ్ల

నూతనంగా మంజూరైన, పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీని మండల కేంద్రమైన ముప్పాళ్లలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదార్లకు పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పెంపుపై లబ్ధిదారుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని, ఎన్నికలకు వెళ్లే ముందు మిగిలిన రూ.250 కూడా పెంచి మొత్తం రూ.3 వేలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం.పద్మ, జెడ్‌పిటిసి ఎస్.చంద్రకళ, తహశీల్దార్ ఎం.భవానీశంకర్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎన్.శ్రీనివాసరావు, సర్పంచులు పి.గాయత్రి లక్ష్మణ్, ఇఒపిఆర్‌డి ఎస్.రూపవతి, వైసిపి నాయకులు ఎంజెఎం రామలింగారెడ్డి, ఎస్.గోపాలరావు, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, ఎ.సాయిరెడ్డి, యు.శ్రీనివాసరెడ్డి, జి.కృపారావు పాల్గొన్నారు.



వృద్ధులకు నిర్మల విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమాన్ని నిర్మల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శనివారం సందర్శించారు. ఆశ్రమంలోని వృద్ధులతో మాట్లాడారు. అనంతరం వారంతా కలిసి సమకూర్చిన నగదుతో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్లు, కూరగాయలు, దుప్పట్లు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రాణి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి ఆసరా లేని వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న గుమ్మడి వృద్ధాశ్రమ నిర్వాహకులను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో అనాథలను, వృద్ధులను ఆదుకోవాలని కోరారు. పుట్టినరోజు వేడుకలు, పెళ్లిరోజు వేడుకలు ఇటువంటి చోట నిర్వహించుకొని వీరికి ఆసరాగా నిలవాలని సూచించారు.

ఎపిఆర్‌జెసికి సోలార్ పరికరాలు వితరణ

ప్రజాశక్తి - విజయపురి సౌత్ : పూర్వ విద్యార్థులు అందించిన సోలార్ పరికరాలను నాగార్జున సాగర్‌లోని ఎపిఆర్‌జెసిలో శనివారం ప్రారంభించారు. కాలేజీలో 1984-86లో చదివిన పూర్వ విద్యార్థులు ఇటీవల కళాశాలకు వచ్చారు. వీరిలో కొందరు మారుతి వాహనానికి చెందిన 4 టైర్స్, సర్వీసింగ్ సేవా చార్జెస్‌తోపాటు రూ.12500తో సమకూర్చిన సోలార్ దీపాలను అందించారు. 40 ఎకరాలు విస్తీర్ణంలో వెలుతురు కోసం కావాల్సిన దీపాలను అమర్చగా శనివారం ప్రారంభించారు. శరత్, వేణుగోపాల్, రంగాచార్యులు, లింగేశ్వరరావు, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, పుల్లయ్య, శ్యాం, రాజశేఖర్, శ్రీను, భాస్కర్, గోపయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.





శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన వాగు

ఆరెకరం పొలంలో శ్రీ సిమెంట్ మట్టి

పరిహారం కోసం రైతు వేడుకోలు

ప్రజాశక్తి - దాచేపల్లి

శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల తాను అరెకరం పొలాన్ని నష్టపోయానని మండలంలోని పెదగార్లపాడుకు చెందిన రైతు అల్లాబక్షు ఆవేదన వెలిబుచ్చారు. ఈ ప్రాంతంలో శనివారం సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.గోపాలరావు, మండల నాయకుల సందర్శన సందర్భంగా వారికి సమస్యను విన్నవించారు. గ్రామ శివారులో శ్రీ సిమెంట్ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారని, ఇందులో భాగంగా ఫ్యాక్టరీ మార్గంలోని వాగుమీద బ్రిడ్జిని నిర్మించారని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణ క్రమంలో వాగులోని మట్టినంతా తీసి వాగును ఆనుకుని ఉన్న పొలాల్లో వేశారని, దీని వల్ల ఆ పొలాలు పనికిరాకుండా పోతున్నాయని, దీంతోపాటు వాగును పెద్దదిగా చేయడం వల్ల తాను అరెకరానికిపైగా పొలాన్ని నష్టపోయానని వివరించారు. వాగు ప్రవాహ దిశనూ మార్చారని, భవిష్యత్‌లో వరద వస్తే ఆ నీరంతా తమ పొలాల మీదగా ప్రవహించే అవకాశం ఉందని తెలిపారు. తన పొలాన్ని అమ్మాలని చూసినా ఈ పరిస్థితులన్నింటి దృష్ట్యా కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, తనకు శ్రీ యాజమాన్యం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని సిపిఎం నాయకులు చెప్పారు.



బాలలతో మాట్లాడుతున్న కె.దస్తగిరి

పిల్లలకు ప్రతినెలా రక్త పరీక్షలు

సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి

ప్రజాశక్తి - ముప్పాళ్ల

బాలల్లో రక్తహీనతను అధికమించాలని, సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి కె.దస్తగిరి అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం సచివాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఆరోగ్య కార్యదర్శి పరిధిలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? ఆయా పాఠశాలలో ఎంత మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు? అనే అంశాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాలలకు ప్రతినెలా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని, రక్షహీనత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. రాష్ట్రంలో 59 శాతం గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని సందర్భాల్లో మరణిస్తున్నారని చెప్పారు. వీటికి అడ్డుకట్ట వేయాలంటే బాల్య వివాహాలను నిర్మూలించాల్సి ఉందని చెప్పారు. బాల్య వివాహాల నిషేధ చట్టం-2006 ప్రకారం బాల్య వివాహాలు చేసే వారికి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని తెలిపారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బడి మానివేసిన పిల్లల తల్లిదండ్రులతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడి పిల్లలను బడికి పంపించాలని కోరారు.

ఉగాది నాటికి 7012 ఇళ్లు పూర్తి చేయాలి : జెసి

గృహ నిర్మాణానికి నిధుల కొరత లేదు - లక్ష్యం మేరకు పనులు చేయకుంటే చర్యలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఉగాది నాటికి పల్నాడు జిల్లాలో 7012 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేలా సిద్ధం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. గృహ నిర్మాణంపై కాంట్రాక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందన హాలులో శనివారం సమీక్షించారు. గృహ నిర్మాణాలకు నిధుల కొరత లేదని, బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి నిధులు మంజూరయ్యేలా మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. లేఅవుట్ వారీగా ప్రత్యేక పరిశీలకులను ఉంచాలన్నారు. ఇప్పటి నుండి క్రమ పద్ధతిలో పక్కా ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఇసుక సిమెంటు ఇనుము తదితర సరుకు సరుకుల సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని కాంట్రాక్టర్లను అడిగారు. పెండింగ్‌లో ఉన్న ఐసిఐసిఐ ఆన్‌లైన్ ఖాతాలను త్వరితగతిన తెరిపించాలని, కూలీలను భారీగా సమీకరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఒప్పంద ప్రకారం లక్ష్యాలను పూర్తి చేయాలని, పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వారి ఇళ్ల స్థితిగతులను లబ్ధిదార్లు తరచూ పరిశీలించుకునేలా చూడాలన్నారు. జిల్లాలో ఇప్పటికీ ఒక లక్ష భూ పట్టాలు పంపిణీ చేసినట్లు జెసి తెలిపారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, పంచాయతీరాజ్ ఎస్సీ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, గోపాలరావు, శ్రీనివాసరావు, షమీ పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జెసి.. హాజరైన అధికారులు

'బోయ, బొంతు, ఒరియాను ఎస్టీల్లో చేర్చొద్దు'



ప్రజాశక్తి - వినుకొండ : ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందిన బోయ, బొంతు, ఒరియా సామాజిక తరగతులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని గిరిజన సంఘాల జెఎసి నాయకులు కోరారు. ఈ మేరకు తాడేపల్లిలోని సిఎం కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. జెఎసి రాష్ట్ర కన్వీనర్, ట్రైబల్ ప్రజా సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎం.విష్ణునాయక్ మాట్లాడుతూ ఎస్టీ జాబితాల్లోకి బోయ, బొంతు, ఒరియాలను చేర్చేందుకు జారీ చేసిన జీవో 52ను, ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 35 గిరిజన ఉప కులాలు, 35 లక్షల మంది ఉన్నామని, ఆర్థికంగా రాజకీయంగా ఇప్పటికే బలపడిన వారిని ఎస్టీ జాబితాలో చేరిస్తే మిగతావారు అన్యాయానికి గురవుతారని వివరించారు. ఈ అంశాలపై ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుమ్మరైబాబుకూ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బి.రామస్వామి, కె.పెంచలయ్య, ఎం.భాస్కర్, ఎం.రమేష్, కె.రాంబాబు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై సిపిఎం బృందం సర్వే

బృంద సభ్యులకు జగనన్న కాలనీ సహా పలు కాలనీల్లో సమస్యలు తెలిపిన ప్రజలు

సిపిఎం శ్రేణులు శనివారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో శనివారం సిపిఎం బృందం జిల్లాలో పలు మండలాల్లో చేపట్టిన సర్వేలో ప్రజలు తమ సమస్యలను బృంద సభ్యులకు తెలిపారు.

గిరిజనులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - మంగళగిరి

పెదకాకాని మండలం నంబూరు గ్రామపంచాయతీ పరిధిలోని 65 మంది గిరిజనులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. శనివారం ప్రజా సమస్యల సర్వేలో భాగంగా నంబూరు గ్రామ గిరిజన కాలనీలో సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నిరుపేదలైన గిరిజనులు ప్రభుత్వ భూమిలో ఏనిమిదేళ్లగా నివాసముంటున్నారన్నారు. విద్యుత్తు మీటర్లు, ఆధార్, ఓటరు కార్డు గుర్తింపు ఉన్నప్పటికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం లేదని విమర్శించారు. గిరిజనులు మాట్లాడుతు ఎస్టీ కమిషన్ దష్టికి తీసుకెళ్ళినప్పటికీ స్పందన లేకుండా పోయిందని పేర్కొన్నారు. అదేవిధంగా జగనన్న కాలనీ సందర్శించారు. కాలనీలో కనీస వసతులు కూడా లేవని లబ్ధిదారులు సిపిఎం నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గిరిజనులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, లేనిచో ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. సిపిఎం పెదకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ నంబూరు సచివాలయ పరిధిలో 150 మందికి జగనన్న పట్టాలు మంజూరు చేశారని, 40 శాతం మందికి మాత్రమే ఇచ్చారని అన్నారు. మిగిలిన వారికి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే సుంకాలరావు, పి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పెనుమూలిలో పలు సమస్యలు

ప్రజాశక్తి - దుగ్గిరాల : దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు ,పెనుమూలి గ్రామంలో జగనన్న కాలనీలను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వై బ్రహ్మేశ్వరరావు తదితర బృందం సర్వే నిర్వహించారు. సర్వేలో లబ్ధిదారులు తమ సమస్యలను బృంద సభ్యులకు తెలిపారు. ఇంటినిర్మాణం బేస్‌మట్టం వరకు రూ.1,50 వేలు అవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే 1,80వేలకు ఇంటి నిర్మాణం పూర్తికాదు. ఐదు రూపాయల వడ్డీలకు అప్పులుతెచ్చి ఇల్లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి. జగనన్న కాలనీలో రోడ్లు లేకపోవడం వల్ల ఇంటి నిర్మాణం కొరకు తెచ్చే సామాగ్రిని తేవడానికి విపరీతమైన ఖర్చవుతుంది. అలాగే మంచి నీరు కూడా సరిగా లేదు. .కంఠంరాజు కొండూరులో 420 ప్లాట్లు ఇస్తే కేవలం 20 , 25 మంది మాత్రమే ఇంటి నిర్మాణం ప్రారంభించారు. జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.

మంచికలపూడిలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామంలో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాచేయడం చేశారు.అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు జె బాలరాజు, వై బ్రహ్మేశ్వరరావు, మహేష్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా కొనసాగించాలి

ప్రజాశక్తి, తాడేపల్లి రూరల్ : వైఎస్‌ఆర్సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆంక్షలు లేకుండా కొనసాగించాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ గ్రామంలో సిపిఎం నాయకులు సంక్షేమ పథకాలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు తదితరులకు ఇచ్చే పింఛన్లకు కోతపెట్టే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. నెల నెల ఇచ్చే పింఛన్లు కు విద్యుత్ వాడకం ఎక్కువగా ఉందని, వెయ్యి చదరపు అడుగులలో ఇల్లు నిర్మాణం చేపట్టారని, కుటుంబ సభ్యులలో ఫోర్ వీలర్ వాహనం ఉందంటూ కొత్త ఆంక్షలు విధించడం సరైన పద్ధతి కాదన్నారు. తాడేపల్లి మండలంలోని సుమారు 500కు పైగా వివిధ రకాల పింఛనుదారులకు గ్రామ సచివాలయ అధికారులు పింఛన్లు నిలిపివేయటం అన్యాయమని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గుండిమెడ గ్రామంలో సచివాలయ అధికారులు 40 మందికి పైగా పింఛన్లను తొలగించేందుకు ఆంక్షలు విధించారని ఆయన విమర్శించారు. తక్షణమే పింఛన్లను తీసుకునే లబ్ధిదారులకు ఆంక్షలు లేకుండా పింఛన్లను కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ,సిఐటియు నాయకులు ఎన్ వి రాజ్, డివైఎఫ్ఐ తాడేపల్లి మండల నాయకులు పల్లె భార్గవ్ పాల్గొన్నారు.


దుగఇగరాల మండలం మంచికలపూడిలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా


తాడేపల్లి లోని నులకపేటలో పాఠశాలను పరిశీలిస్తున్న పాశం రామారావు, తదితరులు


ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో జగనన్న కాలనీ పరిశీలన


మంగళగిరి సర్వేలో సిపిఎం నాయకులు


పెనుమూలిలో జగనన్న కాలనీ పరిశీలన

పొనుగుపాడులో బేస్‌మట్టం వరకు వేశారు

ప్రజాశక్తి - ఫిరంగిపురం : మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సిపిఎం జిల్లా నాయకులు బైరగాని శ్రీనివాసరావు, మండల కార్యదర్శి ఎస్‌ఎం వలి, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరుల బృందం జగనన్న ఇంటి స్థలాలను పరిశీలించారు. ఈ గ్రామంలో మొత్తం 142మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. ప్రభుత్వం ఒత్తిడి మేరకు కొంతమంది బేస్ మట్టం వరకు వేసి ఆపివేశారు. మరి కొంతమంది పునాదులు తీసి ఆపారు. అతి కొద్ది మంది ఇళ్ల నిర్మాణం జరుగుతుందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈసందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతు కనీస మౌలిక వసతులు లేవన్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో ఇళ్ల నిర్మాణం కొనసాగించడం కష్టమని, ప్రస్తుతం భవననిర్మాణరంగం కుదేలవడంతో కార్మికులకు పనులు కూడా దొరకడం లేదన్నారు.ఈ సందర్భంగా బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతు లబ్ధిదారునకు రూ.5లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. గుంటూరు హైవే రోడ్డుకి వెళ్లే రహదారి పూర్తిగా గుంతల మయంగా ఉందని సమస్యను తక్షణమే పరిష్కరించా లన్నారు.

తొలగించినవి పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - మంగళగిరి : అక్రమంగా తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలని సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలోని 8, 9, 19, 20, 22 వార్డుల్లో సిపిఎం బృందం పర్యటించి పెన్షన్‌దారల సమస్యలను పరిశీలించారు. రద్దయిన పెన్షన్లు ఎక్కువగా కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తుందని, మూడు మీటర్ల ఉంటే రద్దయినట్లుగా పింఛనుదార్లు నాయకులకు తెలిపారు. తమ పిల్లలు ఉద్యోగాలు చేసుకుంటే వారి పింఛను తొలగించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి స్వామినాథ్, డి రామారావు, టి హేమ సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నులకపేటలో 9మంది ఉపాధ్యాయులకు ఉన్నది ఆరుగురు

ప్రజాశక్తి-తాడేపల్లి

స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశీలించడానికి సిపిఎం బృందం శనివారం నులకపేటలో పర్యటించింది. పింఛన్లు రాలేదని కొంతమంది, పాఠశాలలో సరిపడనంత ఉపాధ్యాయులు లేరని కొందరు, సచివాలయం దూరంగా ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని మరికొందరు సిపిఎం దృష్టికి తీసుకొచ్చారు. వేలిముద్ర వేయించుకుని తనకు పింఛను ఇవ్వలేదని కాకుమాను శౌరమ్మ వాపోయింది. కొత్త సంవత్సరంలో పెరిగిన పింఛను వస్తుందని ఎంతో ఆశతో ఉన్న తనకు నిరాశ మిగిలిందని తెలిపింది. కొన్నేళ్ల క్రితం భర్త చనిపోతే తనకు వితంతు పింఛను వస్తుందని, ప్రస్తుతం పింఛను జనవరి నెల ఇవ్వకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నానని తనకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులను వేడుకుంది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 206 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని సర్వే బృందం గుర్తించింది. తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఆరుగురు మాత్రమే ఉన్నారని తెలుసుకున్నారు. ఫలితంగా ఉపాధ్యాయులపై పని భారం పడుతుందని, దీనివల్ల చదువులు కుంటుపడే అవకాశం ఉందని చెప్పారు. ప్రధానోపాధ్యాయుని పోస్టు గత కొన్నేళుగా ఖాళీగా ఉందని గుర్తించారు. ఈ పాఠశాలలో పని చేస్తున్న భమీశెట్టి సౌర్యులు, బి.కొండమ్మలకు గత నవంబర్ నుంచి జీతాలు రాలేదని వాపోయారు. ఈ పాఠశాలలో ఒక భవనం కూలడానికి సిద్ధంగా ఉందని సిపిఎం బృందం గుర్తించింది. నాడునేడు పనుల్లో భాగంగా కొత్త భవనాన్ని నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేసింది. పాఠశాలకు చుట్టూ ప్రహరీగోడ లేకపోవడంతో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని స్థానికులు తెలిపారు. సర్వేలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పట్టణ కమిటీ సభ్యులు వేముల దుర్గారావు, స్థానిక నాయకులు ఎ.అనిల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే సుచరిత

ప్రజాశక్తి, పెదనందిపాడు

ప్రజాశక్తి కేలండర్‌ను మాజీ హోం మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రజాశక్తి కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల పత్రిక అని, వారి ప్రయోజనాల కోసం నిత్యం శ్రమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాసింపీరా, ఏబీ పాలెం సోసైటీ చైర్ పర్సన్ కూరేటి భూషయ్య, ఎంపీపీ టి హెబ్సిబా, ఉప ఎంపీపీ షేక్ ఖాసింబి, జడ్పిటిసి కల్లూరి అన్నపూర్ణ, కొమ్మినేని అనంత దుర్గాప్రసాద్, ప్రజాశక్తి విలేకర్లు వి ఎన్ శివయ్య, కొత్త వెంకటశివరావు పాల్గొన్నారు.


కేలండర్ ఆవిష్కరిస్తున్న సుచరిత



బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

సమస్యలపై అఖిలపక్షం వేయాలి : సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన

ప్రజాశక్తి-తెనాలి:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, తక్షణమే అఖిల పక్షం వేసి సమస్యలపై చర్చించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. బీసీల సమస్యలపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా పట్టణంలోని చినరావూరు పార్కు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముందు జ్యోతిరావ్‌పూలే, బిపి మండల్ చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయన్నారు. ఏ పార్టీ చూసినా బీసీలే ఆ పార్టీలకు వెన్నెముఖగా చెప్పుకుంటున్నాయని, పబ్బం గడిచిన తరువాత పట్టించుకోకపోవటం బాధాకరమన్నారు. బీసి కుల గణన ప్రభుత్వం ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. కులగణన దశాబ్దాలుగా జరగకపోవటంతో విద్య, ఉపాది, రాజకీయ రంగాల్లో బిసిలు వెనుకబడిపోతున్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రతి జిల్లాలోనూ బీసీలకు కనీసం మూడు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి చేపట్టిన ర్యాలీకి 22 బిసి సంఘాలు, 8 రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాలు మద్దతు ప్రకటించినట్లు ఆయన చెప్పారు. అలాగే తెనాలిలో ప్రారంభమైన నిరసన ర్యాలీ, ఆందోళనలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరింపచేసామన్నారు. ర్యాలీలో సంఘం నాయకులు కె.క్రాంతికుమార్, జొన్నాదుల వెంకటేశ్వరరావు, మేడిబోయిన గంగాయాదవ్, ఉప్పాల రాజ్‌కిరణ్, కొల్లూరు హనుమంతరావు, జి.ద్వారకానాధ్, పాలేపల్లి కిషోర్, వేముల కృష్ణ, ఓలేటి శివాజీ. పి.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కుర్రా సుజాత, కుర్రా శ్రీను, కె.సుబ్రహ్మణ్యం, కె. స్వాతి, కె.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

వివా స్కూల్లో ముందస్తు సంక్రాంతి

ప్రజాశక్తి - తెనాలి

ముందస్తు సంక్రాంతి సంబరాలు నంబూరు వివా పాఠశాలలో అంబరాన్నంటాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. పాఠశాల ప్రాంగణంలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, ధాన్యం నిల్వలు, గడ్డివాములు గ్రామీణ వాతావరణంలో పండుగ సంబరాలకు అద్దం పట్టాయి. వివా పాలకమండలి సభ్యురాలు వాసిరెడ్డి అరుణప్రియ, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబి సంధానకర్త కే మాధవి, డైరెక్టర్ ఎల్.టి కమాండర్ కేఎస్ రావు విద్యార్థులకు భోగిపళ్లు పోశారు. పొంగళ్ళు, పతంగులు, నత్యాలు తదితర సంబరాలతో విద్యార్థులు సందడి చేశారు. హరిదాసు కీర్తనలు సోదిమ్మ , పిట్టలదొర వేషాల్లో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివా, వివిఐటి వైస్ చైర్మన్ మహదేవ్ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలు, పండుగ విశిష్టతలు విద్యార్థులు తెలుసు కొనేందుకు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు.


విద్యార్థులకు బోగిపళ్లు పోస్తున్న టీచర్లు



గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - కారెంపూడి

ఇంటింటా వైద్యం-ఫ్యామిలీ డాక్టర్ విధానం అనే కార్యక్రమంపై మండలం లోని కారంపూడి, గాదెవారిపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని వైద్యాధికారులు డాక్టర్ బి.దుర్గా రావు, డాక్టర్ ఆర్.ఆంజనేయులు నాయక్ తెలిపారు. మండలంలోని నరమలపాడు, ఒప్పిచర్ల, చింతపల్లిలలో 104 వాహనంతో గ్రామాలలో పర్యటించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం కొంత మంది రోగులను వైద్యశాలకు తరలించనున్నట్లు చెప్పారు. కళ్లకు సంబంధిన, షుగర్, బిపి రోగాలు ఉన్నవారికి తక్షణమే వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.104 వైద్యాధికారి పి.శ్రావణ అఖిల్, ఎఎన్ఎం రాణి,ఎం ఎల్‌హెచ్ పి.లలిత, సర్పంచ్ యు.రామంజమ్మ, వైసిపి నాయకులు శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయొద్దు

ప్రజాశక్తి - వినుకొండ

ఎస్సీల జీవన ప్రమాణాలు, ఆర్థిక పరిపుష్టి కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాలమహా నాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కీర్తిపాటి వెంకటేశ్వర్లు విమర్శించారు. స్థానిక మాల మహానాడు కార్యాలయంలో యూత్ అధ్య క్షులు కనకాల అంకార అధ్యక్షతన సమావేశం జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం పై వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అనేక సార్లు ధర్నాలు, నిరసనల ద్వారా ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్పొరేషన్ నిధులతోపాటు సబ్ ప్లాన్ చట్టాన్ని పూర్తి స్థాయి లో అమలు చేయాలని లేని పక్షంలో ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్య మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి మల్లికార్జునరావు, శావల్యాపురం మండలం ప్రధాన కార్యదర్శి బి.నాగేశ్వరరావు ఉన్నారు.



జలజీవన్ మిషన్‌తో ప్రజలకు రక్షితనీరు

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో తురుమెళ్ళలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు శనివారం అవగాహన సమావేశం జరిగింది. నీరు, పారిశుద్ధ్యం పై అవగాహన కలిగించారు. జలజీవన్ మిషన్ మండల కో-ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు రక్షితనీటిని అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్ల రక్షిత నీరు అందిం చే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. గ్రామస్తులు పరిసర ప్రాం తాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. డ్వాక్రా మహిళలు,విఎఓలు పాల్గొన్నారు.

సిఫార్సులు కాదు అర్హతతో ప్రమోషన్లు ఇవ్వండి..

అధికారులకు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-నరసరావుపేట

అర్హులైన ఆయాలను టీచర్లుగా, హెల్పర్స్ ను వర్కర్స్ గా పదోన్నతి కల్పిం చాలని, సిఫార్సులతో సంబంధం లేకుం డా అర్హతనే ప్రామాణికంగా తీసుకోవాలని అంగ న్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రం నరస రావు పేట ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో పోరాడి సాధించుకున్న హక్కులను జీవోలను పక్కన పెట్టి అర్హులైన హెల్పర్స్ ఉన్నప్పటికీ, సిడిపిఒలు, ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్లు తెచ్చుకోవాలని చెబుతున్నారని, దీనిని ఖండిస్తున్నామని అన్నారు. అర్హత ప్రకారం సెంటర్‌లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉండగా ఎవరికీ తెలియకుండా ఉద్యోగాలు ఇస్తున్నారని మండి పడ్డారు. మృతి చెందిన టీచర్ల స్థానంలో అర్హులైన ఆ యాలకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టులలో ఇదే పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి జీఓ ప్రకారం అర్హులైన ఆయాలను టీచర్స్‌గా, హెల్పర్స్, వర్కర్స్ గా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి హనుమంతరెడ్డి,జిల్లా కోశాధికారి లక్ష్మీ ప్రసన్న మండల అధ్యక్షులు సిలార్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.



పీడీ కార్యాలయంలో సూపరింటెండెంట్ కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

భూ హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం వైఎస్సార్ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకం ద్వారానే సాధ్యమవు తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళలో భూ యజమానులకు భూ హక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 333 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వందేళ్ల తరువాత, భూ వివాదాలకు తావులేకుండా అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల రీసర్వే చేసి భూ రక్షా రికార్డులను తయారు చేస్తున్నామని అన్నారు. భవిష్యత్ లో ఎవరు మార్చలేని విధంగా ఈ పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజకుమారి ,ఎపిపి జైబున్ బీ, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు కళ్ళం విజయ భాస్కర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తం, పాకాల పాడు సొసైటీ అధ్యక్షులు కొర్లకుంట వెంకటేశ్వర్లు, తహశీల్దార్ కె.నగేష్ పాల్గొన్నారు.



రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు



అసమర్థ వైసిపి ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి - పెదకూరపాడు

కార్మిక, కర్షక, పేద మహిళలను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని పెదకూరపాడు మండల తెలుగు మహిళ నేతలు విమర్శించారు. శనివారం మండలం లోని పాటిబండ్లలో మాటామంతి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు నింగిని తాకుతున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న వేధింపులను ఆపలేని అసమర్థ వైసిపి ప్రభుత్వమని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్. కృష్ణకుమారి,షేక్ ముంతాజ్, ఎన్.ఈశ్వరి, పి.శివమ్మ, కె.సుజాత, కె.పద్మలత, జి.పుష్పలత, పాటిబండ్ల నాయకులు బాలిరెడ్డి, సుభాని,సిరాజ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అచ్చంపేట

మండలంలోని మాదిపాడులో శనివారం తెలుగుదేశం పార్టీ మాటా-మంతి కార్యక్రమాన్ని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లా అనుపకళ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుం టున్న వైసిపి ప్రభుత్వం, నిత్యావసర ధరలు పెంచిందని, విద్యుత్ బిల్లులతో ప్రజలను దోచుకుంటున్నారో మహిళలకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. మాదిపాడు టౌన్ టిడిపి అధ్యక్షురాలు వెంకటరమణ, ప్రచారకర్త ఆర్.వెంకటరమణ, అచ్చంపేట కార్యకర్తలు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని దుష్మాన్ పేట తండాలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో తండాకు చెందిన రామవత్ బాలాజీ నాయక్, రామవత్ రవి నాయకులకు చెందిన పూరిళ్లు పూర్తిగా కాలి బూడి దయ్యాయి. ప్రమాద స్థలాన్ని ఎస్సై విప్పర్ల వెంకట్రావు శనివారం సందర్శించారు. బాధితులను పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు. అలాగే, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో బాధితులకు ఐదువేల నగదు,బియ్యం,వంట సామా గ్రిని పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకయ్య అందజేశారు.

మిర్చి సాగుకు ఉల్లిగడ్డ కషాయం మేలు

ప్రజాశక్తి - బెల్లంకొండ

ప్రకృతి వ్యవసాయం విధానంలో ఉల్లిగడ్డ కషాయంను మిరప పంటపై పిచి కారి చేయడం వలన పంటలోని త్రిప్స్ అధిగమించవచ్చని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపాలెం రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ నల్లిని మిరప పంటలో లేకుండా చేసేందుకు ఉల్లిగడ్డ కషాయం బాగా ఉపయోగపడుతుందన్నారు. నారెడ్డిపాలెం ఆర్.బి.కెలో డెమోగా దీనిని తయారు చేసే విధానాన్ని రైతులకు చూపించారు. మిరప పంటను కాపాడుకునేందుకు ఒక ఎకరానికి 50 పసుపు, బునుగు అట్టలను అమర్చాలని సూచించారు. అంతర పంటలుగా ఉల్లి, కొత్తిమీర, ముల్లంగి నాటడం వలన తామర పురుగును నివారించుకోవచ్చని చెప్పారు. పల్నాడు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం జరుగుతున్న గ్రామాల్లోని ఆర్బికేలలో ఆసక్తి గల రైతుల నుంచి ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వీరికి పులివెందులలో ఉన్న ఆర్‌వైఎస్ఎస్ అదే విధంగా ఇండో-జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్ లెర్నింగ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మూడేళ్ల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రకృతి వ్యవసాయంలో శాస్త్రవేత్తగా డిగ్రీ పట్టా ఇస్తారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పెరటి తోటలు, సూర్య మండలంలో పలు రకాల ఆహార ఉత్పత్తులు తినడం వలన ఆరోగ్యంగా ఉంటుందన్నారు. సూర్య మండలం మోడల్ ను మండలంలోని నాగిరెడ్డి పాలెంలో రైతు కె. జ్యోతి 28 రకాల దుంప, తీగ, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పూలు పలు రకాల ఆహార ఉత్పత్తులను సాగు చేస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లాలో ఆరు డివిజన్లలో ఇప్పటి వరకు 12,613 పెరటి తోటలు సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య, విఎఎ అయ్యప్ప, ఎస్పీఎంయు, డిపిఎంయు సిబ్బంది పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



పేదలకు అండగా నిలవాలన్నదే ధ్యేయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కష్టాల్లో ఉన్న పేదలకు అండగా నిలవడమే తమ ధ్యేయమని ఆదరణ మానవ సేవా సహాయ సమితి కార్యదర్శి పలుకూరి జోసెఫ్ బాబు అన్నారు. శనివారం విజయపురిసౌత్ లోని సాగరమాత ఆలయం వద్ద పలుకూరి జోసెఫ్ బాబు ఆధ్వ ర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఫాస్టర్ డేనియల్ శ్యాం బాబు, లాయర్ ప్రభుదాస్,మాజీ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి,జక్కి జయరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛగుంటూరు సాధనలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్వచ్ఛ గుంటూరు, ఆరోగ్య గుంటూరుగా నగరాన్ని మార్చుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు పిలుపునిచ్చారు. శనివారం జిఎంసి కాన్ఫరెన్స్ హాలులో వివిధ విభాగాలలో స్వచ్ఛత పాటించడంలో ఆదర్శంగా నిలిచిన వారికి స్వచ్ఛ అవార్డులను మేయర్, కమిషనర్లు అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి మెరుగైన ర్యాంకు తీసుకురావడానికి ప్రజలందరూ సహకరించాలని అన్నారు.స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు అంటే మన నగరాన్ని ఆరోగ్య నగరంగా మార్చుకోవడమేనన్నారు. త్వరలో ఇంటింటి చెత్త సేకరణకు వీలుగా 220 ఈ-ఆటోలు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో గుంటూరు నగరం గత ఏడాదితో పోల్చితే ఉత్తమ ర్యాంకు సాధించడానికి నగర పాలక సంస్థ విస్తత చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్ల మీద కాలువల్లో వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, వివిధ సంస్థలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో సి.యం.హెచ్.ఓ విజయలక్ష్మి, యం.హెచ్.ఓ భాను ప్రకాష్, కార్పొరేటర్ యేరువ సాంబిరెడ్డి, యస్.యస్‌లు ఆనంద కుమార్, రాంబాబు, సోమశేఖర్, ఆయుబ్ ఖాన్ లు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందచేస్తున్న మేయర్, కమిషనర్



సిపిఎం అభిమాని విజయమ్మ మృతి

ప్రజాశక్తి-తెనాలి

రూరల్ గ్రామం గుడివాడకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయిని, సిపిఎం సానుభూతి పరులు కర్రె విజయమ్మ (78) శుక్రవారం మృతిచెందారు. ఆమె భర్త కర్రె జోసఫ్ సిపిఎం గ్రామ కార్యదర్శిగా పనిచేశారు. కుమారుడు ఉదయభాను యుటిఎఫ్‌లో పనిచేశారు. విజయమ్మ మృతదేహానికి కోపల్లెలో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో సీపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.భవన్నారాయణ, నాయకులు ములకా శివసాంబిరెడ్డి, జ్యోతుల కోటేశ్వరరావు, బసవపున్నయ్య, గ్రామ మాజీ సర్పంచ్ మాతంగి రత్నం పాల్గొని, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఉత్సాహంగా మాస్టర్ అథ్లెటిక్స్

ప్రజాశక్తి-గుంటూరు

మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ అథ్లెట్లకు స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో శనివారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విశాఖపట్నం వారు సాధించారు. మెన్స్ ఛాంపియన్‌షిప్ గుంటూరు వారు, మహిళా ఛాంపియన్‌షిప్ నెల్లూరు వారు సాధించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో కోవెల మూడి నాని పాల్గొని పతకాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వయస్సు కలిగిన క్రీడాకారులు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు లాల్‌వజీర్, రవి, కాలేషావలి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఓవరాల్ ఛాంపియన్‌షిప్ అందుకుంటున్న విశాఖ పట్టణం క్రీడాకారులు

జిల్లా స్థాయి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరులీగల్

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థను శనివారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. గుంటూరు జిల్లా న్యాయసేవా సంస్థ ఛైర్మన్ వైవిఎస్‌బిజి పార్థసారథి, కార్యదర్శి కె.రత్నకుమార్, గుంటూరు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎంపికైన పుసులూరి జీవరత్నం అలియాస్ జీవ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇల్లా మధుబాబు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నేలమిల్లి జ్యోతిశ్రీ పాల్గొన్నారు.గుంటూరులోని అన్ని కోర్టుల్లో ఉన్న ఫ్రీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కేసులను డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ ప్రతిపాదించి ఎన్నుకోబడిన ఈ ముగ్గురు న్యాయవాదులు వాదిస్తారని పార్థసారథి తెలిపారు. న్యాయవాదులను నియమించుకోలేని వారు గుంటూరు జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదిస్తే వారికి ఉచితంగా కేసులను వాదించేందుకు సహకరిస్తామని జీవరత్నం, మధుబాబు తెలిపారు.



జీవో నెం1 రద్దు చేయాలి

తాడికొండలో ప్రతుల దహనం

ప్రజాశక్తి - తాడికొండ

ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో నంబర్ 1ని వ్యతిరేకిస్తూ తాడికొండ - అడ్డరోడ్డు సెంటర్ లో శనివారం నిరసన తెలిపారు. జీవో ప్రతులను దగ్ధం చేశారు. సిపిఐ, సిపిఎం నాయకులు శివ శంకరరావు, చింతల భాస్కరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరికీ ఆందోళనలు, నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు తీసుకువచ్చిన జీవో నెంబర్ 1ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు పచ్చల సాంబశివరావు, గుర్రం కొండ సత్యనందం,కాబోతు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో 1ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్ కుమార్ కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం తాడికొండ - అడ్డరోడ్డులో జీవో 1 కి వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తాడికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ షరీఫ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ లియాకత్, అలీ,షేక్ జాన్ షైదా, షేక్ మదర్సా తుళ్లూరు మండల ఉపాధ్యక్షులుఅడుసుమల్లి శ్రీనివాస్,షేక్ రఫీ పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ, విద్యార్థుల నిరసన

విచారణ చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి-తెనాలి

పాఠశాల్లో విద్యాబోధన కంటే సొంత వ్యాపారాలే పరమావధిగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను తొలగించా లని శనివారం విద్యార్థులు, విద్యార్థిసంఘ నాయకులు, పేరెంట్స్ కమిటీ, వార్డు కౌన్సిలర్ పాఠశాల ఎందుట ఆందోళన చేశారు. స్థానిక ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో క్రాఫ్ట్ ఉపాధ్యాయిని విదినిర్వహణలో ఆలసత్వం వహిస్తున్నారని, ఆమెను విధుల నుంచి తొలగించాలని, అలాగే ఆమెకు వత్తాసు పలుకుతున్న హిందీ ఉపాధ్యాయిని బదిలీ చేయాలని పేరెంట్స్ కమిటీ రెండు రోజుల క్రితం పాఠశాల ఎదుట ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో క్రాఫ్ట్ ఉపాధ్యాయినిని జిల్లా విద్యాశాఖకు సరెండర్ చేయగా, హిందీ ఉపాధ్యాయినిని మరో పాఠశాలకు బదిలీ చేశామని అధికారులు ప్రకటించినా లిఖిత పూర్వకంగా ఉత్తర్వులు లేకపోవటంతో విద్యార్థులతో పాటు విద్యార్థి సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, పెరెంట్స్ కమిటీ, కౌన్సిలర్లు గెడ్డటి సురేంద్ర, జి.ఝాన్సివాణి ఆందోళన చేశారు. జిల్లా విద్యాధికారి పాఠశాలకు రావాలని, పరిస్థితులను పరిశీలించి చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో డీఈవో శైలజ, ఉపవిద్యాధికారిణి నిర్మల, మండల విద్యాధికారి ఎం.లక్ష్మీనారాయణ పాఠశాలకు చేరుకున్నారు. వార్డు కౌన్సిలర్‌తో పాటు పేరెంట్స్ కమిటీతో సమావేశమయ్యారు. క్రాఫ్ట్ ఉపాధ్యాయిని విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇవ్వటంలేదని, అలాగే హిందీ ఉపాధ్యాయిని సొంత వ్యాపారాలకోసం ఫోన్ సంప్రదింపులతోనే కాళం వెళ్ళదీస్తున్నారని అధికారులకు వివరించారు. తక్షణమే హిందీ ఉపాధ్యాయినిని పాఠశాల నుంచి బదిలీ చేయాలని డిమాండ్, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని, ప్రతినెల పాఠశాలను విద్యాధికారులు తనిఖీ చేయాలని కోరారు. ఉపాధ్యాయుల తీరుపై లోతైన విచారణలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంటే హిందీ ఉపాధ్యాయిని విద్యాశాఖా మంత్రిని ఆశ్రయించినట్లు సమాచారం. మంత్రి చొరవ మేరకు అధికారులు విచారణకు ఉపక్రమించినట్లు తెలిసింది. ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ వివరణ కోరగా విచారణ కొనసాగుతోందని బదులిచ్చారు. ఆందోళనలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలకా కిరణ్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రాజు, స్థానికులు నలుకుర్తి అమృతరాజు, మట్టపూడి రాజేశ్వరరావు, పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


పేరెంట్స్ కమిటీ, కౌన్సిలర్, పేరెంట్స్‌తో మాట్లాడుతున్న అధికారులు

జనావాసాల మధ్య బార్ అండ్ రెస్టారెంట్ వద్దు : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని, పొన్నూరు రోడ్డు ప్రధాన రహదారి పక్కన జనావాసాలు, విద్యా సంస్థలు, ప్రార్థన మందిరాల సమీపంలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సిపిఎం పాత గుంటూరు శాఖ కార్యదర్శి శనగపల్లి కార్తీక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.జనావాసాలకు దగ్గరగా, ఆర్అండ్‌బి రహదారిపై మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మహిళలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో ప్రధాన రహదారులకు సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని, న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ఎక్సైజ్ అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రజల నిరసనలను గౌరవించి బార్ ఏర్పాటును నిలిపివేయాలని లేని పక్షంలో స్థానికులు, మహిళా సంఘాలతో కలిసి ఉమ్మడి ఆందోళనకు పూనుకుంటామని కార్తీక్ స్పష్టం చేశారు.

12న ఎస్ఎల్ఎం హైస్కూల్‌లో 'వక్త' ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి

ఎస్‌టిఇపి (స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్) గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో 'వక్త' అంశంపై శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు ఆకురాతి శంకరరావు తెలిపారు. 12వ తేదీ గురువారం మంగళగిరి ద్వారకానగర్ ఎస్ఎల్ఎం చైతన్య హైస్కూలులో నిర్వహించే ఈ కార్యక్రమానికి 50 మందికి మాత్రమే అవకాశముందని తెలిపారు. ఉచిత శిక్షణకు హాజరు కాదలచిన వారు తమ పేర్లను 10వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, సమాచారం కోసం ఫోన్ నంబర్లలో 85228 02180, 92972 52797 లలో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతు నేటి సమాజంలో విద్యార్థుల, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆలోచనల్లో, దక్పథంలో వస్తున్న మార్పులో జ్ఞానాన్ని, నైతికతని, ఏకాగ్రతని నింపి మంచి మోటివేషనల్ ట్రైనర్స్ విద్యాలయంలో ఉండాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

నేడు ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర జూనియర్ ప్రైవేట్ కళాశాల యాజమాన్య సంఘం రాష్ట్ర మహాసభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు మంగళగిరి మార్కండేయ కళ్యాణ మండపంలో జరుగుతుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వి ప్రసాద్ శనివారం తెలిపారు. మహాసభలో భవిష్యత్ కార్యాసరణ, నూతన కమిటీ ఎన్నుకోవడం జరుగుతుంది అని తెలిపారు.


కొండలరావును అభినందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

స్కోప్ సంస్థ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

స్కోప్ సంస్థ పేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శనివారం గుంటూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో స్కోప్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దేవరపల్లి కొండలరావును మంత్రి సన్మానించారు. స్కోప్ సేవలను లండన్‌లోని ఐఎస్ఓ సంస్థ గుర్తించి బెస్ట్ క్వాలిటీ మేనేజ్మెంట్ పురస్కారం ఇవ్వడం హర్షణీయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కోప్ చేస్తున్న సేవలకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం కూడా పేదలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిషోర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి విల్సన్ పాల్గొన్నారు.

'గ్రంథాలయాలు, విద్య, ప్రజాసంస్కృతి'పై నేడు సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజా వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలోని 'గ్రంథాలయాలు, విద్య, ప్రజా సంస్కృతి' అంశంపై సదస్సు జరుగుతుందని వేదిక బాధ్యులు రావి శారద, డి రమేష్ పట్నాయక్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే మొదటి సెషన్లో 'విద్య, గ్రంథాలయోద్యమం' అన్న అంశంపై ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, 'ప్రజా సంస్కృతి, పునర్వికాసం' అంశంపై ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, 'మూఢ విశ్వాసాలు-విజ్ఞాన శాస్త్రం'పై ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య ప్రసంగిస్తారని తెలిపారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు జరిగే రెండో సెషన్లో 'భారతదేశంలో బహుళత్వం-జాతీయ సమైక్యత'పై మాజీ ఎంఎల్సి ఎంవిఎస్ శర్మ, 'లౌకికవాదం-నేటి సవాళ్లు' అంశంపై ప్రొఫెసర్ ఎన్ అంజయ్య, 'ప్రజాస్వామ్యం - రాజకీయాలు - రాజ్యాంగం' అంశంపై పిడిఎఫ్ ఎంఎల్సి కెఎస్.లక్ష్మణరావు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ సదస్సులో గ్రంథాలయాల నిర్వాహకులు, రచయితలు, కవులు, విద్యా, సాంస్కృతిక రంగాల ప్రముఖులు, ప్రచురణకర్తలు, ప్రజాస్వామ్య ప్రియులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని రావి శారద, రమేష్ పట్నాయక్ కోరారు.

పర్యాటక కేంద్రంలో మూతపడ్డ గ్రంథాలయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్



మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని గ్రంథాలయం నిత్యం మూసి ఉంచడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు, స్థానికులు గ్రంథాలయానికి వచ్చి తిరుగుముఖం పడుతున్నారు. ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులు వివిధ రకాల పుస్తకాలు చదివేందుకు గ్రంథాలయానికి వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు. విజయపురిసౌత్ పర్యాటక కేంద్రం కావడంతో గ్రంథాలయానికి పాఠకులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. సమాచార కేంద్రం రోజుల తరబడి మూసి ఉండడంతో నిత్యం గ్రంథాలయానికి వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అధికారులు చర్యలు చేపట్టి గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు

కిట్స్‌లో కెరీర్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు: కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ఎలివేట్ రెండ్రోజుల కెరియర్ ఎదుగుదల కార్యక్రమం 2023 జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించారు. కార్యక్రమాన్ని కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్స్‌లెన్స్ ఫౌండేషన్‌తో కలిసి ఆవిష్కార్ క్లబ్ సిఎస్ఈ, సిఎఐ, సిఎస్‌డి, ఈఈఈ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న 500 మంది విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి నిపుణులైన వక్తలు నరేష్ ఇండియన్ ఫౌండర్ కెఐవైఈఎఫ్, లైఫ్ స్కిల్స్ ట్రైనర్, రచయిత శ్రావణ్ కుమార్, బోయిన్, ఎమినెంట్ స్పీకర్ సయ్యద్ రఫీ, మోటివేషనల్ స్పీకర్, సేల్స్ ట్రైనర్ మురళి మోహన్‌గాడే, డైరెక్టరేట్ ఆఫ్ సిస్టమ్స్ డిఆర్‌డిఎల్, ఎ.గోపిరాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి ఛైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విద్యార్థులను సత్కరించారు.

ఎన్నారై విద్యార్థులకు యుఎస్ఎ కంపెనీ అవగాహన

ప్రజాశక్తి - మేడికొండూరు



హెచ్‌పిఇ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రతి విద్యార్థి భావోద్వేగాలను నియంత్రణలో పెట్టుకుని, జీవితంలో ఉన్నతమైన స్థానాన్ని సాధించే లక్ష్యం కలిగి ఉండాలని అమెరికాకు చెందిన హెచ్ పిఇ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు శ్రీదేవి అన్నారు. మండలంలోని విసదల అడ్డరోడ్డు వద్దగల ఎన్నారై ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మానసిక వికాసంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కోనేరు శ్రీదేవి మాట్లాడుతూ యువత మనసులో పుట్టే ప్రతి ఆలోచనను ఒక్క క్షణం ఆలోచించి మంచి చెడులతో పరిశీలన చేసుకుని చెడును విడనాడి, మంచి ఆలోచన వైపు నడవాలని అన్నారు. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ వాటిని ఎదుర్కొని నిలవాల్సిన మనోధైర్యాన్ని ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి విద్యార్థి టెన్షన్ రిలీఫ్ కు ధ్యానం, యోగా క్రమం తప్పకుండా చేసుకొని మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.ఈ సందర్భంగా కోనేరు శ్రీదేవిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి రావు, ఏవో బి సీతారామయ్య, ఎన్ ఎస్ ఎస్ ఎం ప్రోగ్రాం అధికారి పి రవికుమార్, వివిధ శాఖల విభాగాధిపతులు డాక్టర్ చంద్రమౌళి ,రెహమాన్, రాము, కోటేశ్వరరావు, సుజాత, బోధ నేతర సిబ్బంది, పలువురు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు

ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలోని టెన్నిస్ కోర్టులలో సీనియర్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను శనివారం కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, కమిషనర్ సెంట్రల్ టాక్స్ (సీజీఎస్టీ) యం.ఆర్.ఆర్.రెడ్డి, స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్‌లతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. టెన్నిస్ ఆడటం వలన మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. యం.ఆర్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ టెన్నిస్ క్రీడ చాలా మంచి క్రీడ అని, టెన్నిస్ ఆడడం వలన ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని అన్నారు. స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి. శామ్యూల్ జోనాథన్ మాట్లాడుతూ ఆఫీసర్స్ క్లబ్‌కి టెన్నిస్ క్రీడలో ఎంతో చరిత్ర ఉందని, క్లబ్‌లోని టెన్నిస్ కోర్టులలో అంతర్జాతీయ క్రీడాకారులు ఆడిన సన్నివేశాలను గుర్తుచేశారు. క్లబ్ కార్యదర్శి, అసిస్టెంట్ కమిషనర్ (సీజీఎస్టీ) సెంట్రల్ టాక్స్ సిహెచ్.విల్సన్ బాబు మాట్లాడుతూ ఈ పోటీలు పురుషుల 35 ప్లస్, 45 ప్లస్, 55 ప్లస్, 65 ప్లస్ కేటగిరీలలో డబుల్స్ ఈవెంట్లలో ఎన్టీఆర్ స్టేడియం, బి.ఆర్ స్టేడియం, ఎల్‌పీఎస్‌లలో జరుగుతాయని తెలిపారు. పోటీలలో దాదాపు 150 ఎంట్రీలు వచ్చాయని, విజేతలకు ప్రైజ్‌మని అందజేస్తామన్నారు. ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాబోయే రోజులలో ప్రతిష్టాత్మకమైన టెన్నిస్ పోటీల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్, జిఎస్‌టి కమిషనర్, ఇన్ఫర్మేషన్ కమిషనర్ బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. అలాగే టెన్నిస్ ఆడి ఆహుతులను అలరించారు. టెన్నిస్‌తో పాటు షెటిల్ బ్యాట్మెంటన్ పోటీలను ప్రారంభించి క్లబ్‌లోని సదుపాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కార్యదర్శి డాక్టర్ రసూల్, కె. రాజు, బాపిరెడ్డి, ఎస్పీ (పిటిటి) శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్



మాట్లాడుతున్న మూర్తి

సమాచార హక్కుపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

సమాచార హక్కు చట్టం 2005పై అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు సమగ్ర అవగాహన కల్గి ఉండాలని జిఎంసి అదనపు కమిషనర్ పెద్ది రోజ తెలిపారు. శనివారం కమిషనర్ ఆదేశాల మేరకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జిఎంసి మినిస్టీరియల్ సిబ్బంది, సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం 2005పై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమగ్ర అవగాహన కల్గి ఉండాలన్నారు. అందుకు నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. నిర్దేశిత సమయంలో, లభ్యతలో ఉన్న సమాచారాన్ని అందించాలన్నారు. చట్టంలో దరఖాస్తులు, వాటి పరిష్కారం, అప్పీల్ సమయం, అప్పీల్ అథారిటి, జరిమానాలు, సంబంధిత రికార్డ్‌ల నిర్వహణ తదితర అంశాల్లో పక్కాగా ఉండాలని తెలిపారు. ప్రతి విభాగంలో సమాచార హక్కు దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేకంగా అధికారులను నియమించడం జరిగిందన్నారు. అనంతరం ఎన్.జి.ఓ.అసోసియేషన్ గుంటూరు నగర కార్యదర్శి ఎంఎన్ మూర్తి సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్గించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ.భాస్కర్, సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, సూపరిండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా జైలులో తనిఖీ

ఖైదీల ఆహారాన్ని రుచి చూసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నకుమార్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

క్యాలెండరు కార్యక్రమాల్లో భాగంగా నూతనంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరులో ప్రారంభించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టం చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుసులూరు జయరత్నం, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఇళ్ల మధుబాబుతో కలిసి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నకుమార్ శనివారం జిల్లా కారాగారాన్ని తనిఖీ చేశారు. కారాగారంలోని లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను సందర్శించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం గురించి పలు సూచనలు చేశారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టంలో ఉచిత న్యాయ సహాయానికి అర్హులైన ఖైదీలు అర్జీ పెట్టుకున్నట్లైతే ఎటువంటి అలస్యం లేకుండా ఉచిత న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తుందని వివరించారు. తర్వాత వంటకాలను పరిశీలించి అక్కడ ఖైదీలకు అందించే ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. జైలు సిబ్బందికి వంటశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియ చేశారు.

రాజకీయ తొక్కిసలాట

7 వీక్షణం

గుంటూరులో ఎన్టీఆర్ జనతా వస్త్రాలు, చంద్రన్న కానుకలు పంపిణీ లో జరిగిన తొక్కేసలాట ఘటన రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ కార్యక్రమం నిర్వహకులు, ఉయ్యూరు ఫౌండేషన్ అధినేత ఉయ్యూరు శ్రీనివాసరావు వ్యవహార శైలిపై తెలుగుదేశం పార్టీలో కూడా అసంతప్తి నెలకొంది. ఆయన ఏకపక్షంగా వ్యవహరించడం వల్లనే పార్టీకి చెడ్డ పేరు వచ్చిందని కొంతమంది నాయకులు వాపోతున్నారు. సీనియర్ నాయకులను సైతం ఆయన పట్టించుకోలేదని టిడిపిలో చర్చ జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నారైలు తెలుగుదేశం నాయకులతో సమన్వయ లేకుండా వ్యవహరించడం పార్టీ నాయకులను కలవరపరిచింది. తొక్కిసలాట ఘటనను ఆసరాగా చేసుకుని ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటిని అమల్లోకి తీసుకువచ్చింది. ఈ జీవో వల్ల ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేసే హక్కులను నిరోధించే అవకాశం ఉందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఒకటి, రెండు సంఘటనలను ఆసరాగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ తరహా జీ.వో.లను తీసుకురావడంపై ప్రతిపక్షాలన్నీ మూకుమ్మడిగాఆందోళనకు సిద్ధమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో రోడ్ షోలు, ర్యాలీలు నిర్వహించడం గత కొన్ని సంవత్సరాలుగా రాజకీయ పార్టీలు కొనసాగిస్తున్నాయి. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్ష పార్టీలు సహజంగానే ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి పక్షాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం జి.వో. నెంబర్ ఒకటిని అమలు లోకి తీసుకు వచ్చిందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. 2018లో వై.ఎస్. జగన్ జిల్లాల్లో దాదాపు నెల రోజుల పాటు పాదయాత్ర చేశారు. ప్రతి రోజు జిల్లాలో ఏదో ఒక కూడలి ప్రదేశం లో ప్రచార సభలు నిర్వహించారు. అలాగే 2019 ఎన్నికల ప్రచార సభలు కూడా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రహదారుల పైనే నిర్వహించారు. అయితే టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కందుకూరు, గుంటూరు లో జరిగిన సభల్లోతొక్కిసాట జరిగి 11మంది మృతి చెందిన సంఘటనలను ఆసరా చేసుకొని జీ.వో. ఒకటిని ప్రభుత్వం తీసుకు రావడాన్ని రాజకీయ పక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. తొక్కిసలాట ఘటన పై పోలీసులు తగిన దర్యాప్తు జరపకుండా హడావిడిగా ఉయ్యూరు శ్రీనివాసరావును అరెస్ట్ చేశారు. మరో వైపు టిడిపి తరపున న్యాయవాదులు ఈ ఘటన కేవలం ప్రమాదంతో కూడిన ఘటనగా వాదించారు. దీంతో న్యాయస్థానం శ్రీనివాసరావుకి రిమాండును తిరస్కరించింది.

ప్రమాద ఘటన అని న్యాయస్థానం నిర్ధారించిన తరువాత మొత్తం ఘటనకు చంద్ర బాబు నాయుడును బదనాం చేయాలని వైసిపి చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. ప్రమాద ఘటనను ఆసరాగా చేసుకొని ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే సభలు ర్యాలీలు రోడ్ షోలను నిషేధిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై కూడా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది.

ఎవిడి శర్మ